# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 28-07-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1. భారత సైనిక శక్తిని "ఆపరేషన్ సిందూర్" ప్రపంచానికి చాటి చెప్పిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.**

**2. సింగపూర్ పర్యటనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు ఆ దేశ ప్రభుత్వ ప్రతినిధులతో సమావేశమవుతారు.**

**3. తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈరోజు జరగనుంది.**

**4. ఆంధ్రప్రదేశ్‌లో రెవెన్యూ సమస్యలు పరిష్కరించేలా మంత్రివర్గ ఉపసంఘం పనిచేస్తోందని ఆ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు.**

**5. కాలానుగుణ వ్యాధుల నియంత్రణకు వైద్యశాఖ సన్నద్ధంగా ఉండాలని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.**

========================

భారత సైనిక శక్తిని "ఆపరేషన్ సిందూర్" ప్రపంచానికి చాటి చెప్పిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. రాజేంద్రచోళుడు 'గంగైకొండ చోళపురం' రాజధానిని నిర్మించి వెయ్యి సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా తమిళనాడు అరియలూరు జిల్లాలో గత సాయంత్రం నిర్వహించిన ఆడి తిరువతిరై ఉత్సవాల ముగింపు వేడుకలో ప్రధానమంత్రి పాల్గొని, చోళుల జ్ఞాపకార్థం స్మారక నాణేన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి ప్రసంగిస్తూ.. చోళుల పాలన ప్రేరణతోనే వికసిత్ భారత్ కార్యక్రమం అమలవుతోందన్నారు. భారత్ పై దాడికి పాల్పడే వారికి దేశం ఎలా సమాధానం చెబుతోందో ఆపరేషన్ సిందూర్ తెలియజేసిందని చెప్పారు. ప్రపంచం భారత్ శక్తిని అంగీకరించాల్సిన అవసరం ఏర్పడిందని ప్రధానమంత్రి తెలియజేస్తూ,

వాయిస్.. 35 సెకన్లు

---------------------------

మరో వైపు మన్ కీ బాత్ మనసులోని మాట కార్యక్రమంలో భాగంగా నిన్న దేశ ప్రజలనుద్దేశించి ప్రధానమంత్రి పలు అంశాలపై ప్రసంగించారు. దేశమంతా ఒకే ఆలోచనతో, ఐకమత్యంగా ముందుకు వెళితే దేనినైనా సాకారం చేసుకోవచ్చుని, స్వచ్ఛ భారత్ ఉద్యమం అందుకు ఉదాహరణగా నిలుస్తుందని పేర్కొన్నారు.

కాగా మన్ కీ బాత్ 124వ సంచికపై ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈ రోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సింగపూర్ పర్యటన కొనసాగుతోంది. పర్యటనలో భాగంగా ఈ రోజు ఆ దేశ ప్రభుత్వ ప్రతినిధులతో సహా... పలు సంస్థల అధిపతులతో సమావేశమవుతారు. ఈ సందర్భంగా నగరాల అభివృద్ధి, క్రీడలు, పోర్ట్ ఆధారిత సంస్థలపై వారితో చర్చిస్తారు. సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి డాక్టర్ టాన్ సీ లెంగ్‌తో ముఖ్యమంత్రి సమావేశవుతారు. మధ్యాహ్నం సింగపూర్ క్రీడా పాఠశాలను సందర్శించి ఆంధ్రప్రదేశ్‌లో క్రీడల అభివృద్ధి ప్రణాళికలు అనుసంధానించే అంశంపై చర్చిస్తారు. సాయంత్రం ఆంధ్రప్రదేశ్ – సింగపూర్ బిజినెస్ ఫోరం నిర్వహించే రోడ్ షోకు హాజరవుతారు. సింగపూర్, అంతర్జాతీయ పెట్టుబడిదారుల సమక్షంలో రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికలపై ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు.

కాగా నిన్న ప్రవాసాంధ్రుల ఆధ్వర్యంలో నిర్వహించిన “తెలుగు డయాస్పోరా” కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొని మాట్లాడుతూ,

వాయిస్ ..32 సెకన్లు

---------------------------

తెలంగాణ ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం సమావేశం ఈ రోజు జరగనుంది. హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలో జరిగే ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపై చర్చించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, యూరియా ఎరువుల లభ్యత, రేషన్‌కార్డులు, జిల్లాల్లో మంత్రుల పర్యటనల్లో పరిశీలించిన అంశాలపై మంత్రివర్గం చర్చించనుంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో రెవెన్యూ సమస్యలు పరిష్కరించేలా మంత్రివర్గ ఉపసంఘం పనిచేస్తుందని ఆ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. విశాఖపట్నంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏడాది పాలనలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలపై కరపత్రాలను పంపిణీ చేశారు. త్వరలో ఫ్రీహోల్డ్ భూములు, ఇనాం భూములుతో సహా అనేక భూ సమస్యలకు పరిష్కారం చూపుతామని మంత్రి ఈ సందర్భంగా తెలియజేస్తూ,

వాయిస్ .. 25 సెకన్లు

---------------------------

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఈరోజు నుంచి లోక్ సభలో, రేపటి నుంచి రాజ్యసభలో పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ అంశాలపై చర్చ జరగనుంది. ఈ అంశంపై ఉభయసభల్లో చర్చకు గానూ 16 గంటల సమయం కేటాయించారు. ఉగ్రవాద వ్యతిరేక పోరులోభారత్ వైఖరిని కేంద్ర ప్రభుత్వం మరోసారి తెలియజేయనుంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలోని సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రం– షార్‌లో భవిష్యత్తు అవసరాల దృష్ట్యా నూతనంగా నిర్మించిన 11 ప్రాజెక్టులను భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ – ఇస్రో ఛైర్మన్ నారాయణన్ ఈరోజు ప్రారంభిస్తారు. ఈ నెల 30న నైసార్ ఉపగ్రహ ప్రయోగం చేపట్టనుండటంతో ఆయన ఈ రోజు షార్‌కు రానున్నారని ఇస్రో అధికారులు తెలిపారు.

---------------------------

కాలానుగుణ వ్యాధుల నియంత్రణకు వైద్యశాఖ సన్నద్ధంగా ఉండాలని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనుల పురోగతిపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా.. మంత్రి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఔషధాలు, అవసరమైన వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని.. ఇసుక సరఫరాలో ఆటంకాలు లేకుండా చూడాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

---------------------------

ఇంగ్లాండ్ లోని మాంచెస్టర్ వేదికగా భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరుగుతున్న టెస్టు క్రికెట్ మ్యాచ్‌లో భాగంగా భారత్ రెండవ ఇన్నింగ్స్‌లో నాలుగవమ్యాచ్ ను డ్రాగా ముగించింది. భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 143 ఓవర్లకు గాను 4 వికెట్ల నష్టానికి 425 పరుగులు చేసింది. కాగా తొలి ఇన్నింగ్స్‌లో భారత జట్టు 358, ఇంగ్లండ్ జట్టు 669 పరుగులు చేశాయి.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాం దిగువ ట్రోపో ఆవరణలో నైరుతి, పశ్చిమ దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎల్. నారాయణ తెలియజేస్తూ...

వాయిస్.. 17 సెకన్లు

మరోవైపు.. తెలంగాణలోనూ ఈరోజు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

====================